క్లుప్తంగా

పట్టణ కన్వీనర్ ఇంటికి విచ్చేసిన జెడ్పీ చైర్మన్



హేమంత్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం వైఎస్సార్ సీపీ పలమనేరు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి మనవరాలు నామకరణం కార్యక్రమానికి విచ్చేశారు. చిన్నారిని ఆశీర్వదించారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజం అభివృద్ధి

సదుం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎర్రాతివారపల్లె సర్పంచ్ కళావతి తెలిపారు. గ్రామంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికే పౌరహక్కుల దినోత్సవం



పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: ఎస్టీల సమస్యల పరిష్కారానికే పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో బాలాజి తెలిపారు. వారు సోమవారం కడపల్లి యానాది కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి హేమలత, ఎంఈవో తులసీరామ్ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

పలమనేరు: పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని తహసీల్దార్ ఇన్బనాథన్ తెలిపారు. మండలంలోని పెంగరగుంట పంచాయతీ ఇంద్రానగర్‌లో సోమవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు తమకు అన్యాయం జరిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏవో మోహన్‌కుమార్

చౌడేపల్లె: రైతులు సాగుచేసిన పంటలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ రామ్మూర్తి, ఏవో మోహన్‌కుమార్ తెలిపారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన ప్రతి పంటనూ నమోదు చేయాలన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, పంటల బీమా పొందడానికి అవకాశం వుంటుందని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి పంట నమోదును చేసుకోవాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కుప్పం రూరల్: మండలంలోని మోడల్ కాలనీ సమీపంలో ఆదివారం బైక్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం మోట్లచేను గ్రామానికి చెందిన శివరాం బైక్‌లో కుప్పం నుంచి మోడల్ కాలనీ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో రాగిమానుమిట్టకు చెందిన యువకులు బైక్‌లో మోడల్ కాలనీ నుంచి వస్తూ శివరాంను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన శివరాంను స్థానికులు కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మణి మిత్ర బృందం

కుప్పం రూరల్: కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అతని వివరాల కోసం పోలీసులు ఆరా తీసినా ఫలితం లేదు. ఈ క్రమంలో డీకే పల్లికి చెందిన మణి తన మిత్ర బృందంతో కలిసి రైల్వే పోలీసుల అనుమతితో ఆ వ్యక్తి శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. మణి, అతని మిత్ర బృందాన్ని స్థానికులు అభినందించారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

- కూటమి అక్రమాలను అప్‌లోడ్ చేయండి
- అధికారం ఉందని తప్పు చేసినవారికి తప్పదు శిక్ష
- పార్టీ బలోపేతం కోసమే కమిటీలు
- మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ



వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్కును ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్ సీపీ తీసుకువచ్చిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు అండగా ఉంటుందని, కూటమి నేతల దాడుల్లో గాయపడిన వారికి భరోసా కల్పిస్తుందని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కరణ, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతోందని దుయ్యబట్టారు. అలాగే కూటమి నేతలు అధికార మదంతో తమ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వారికి అండగా ఉండేందుకే జగనన్న వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని తెలిపారు. బాధిత నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు తమకు జరిగిన అన్యాయం, దాడులు తదితరాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, వివరాలను డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. ఇప్పుడు అధికారం ఉందని తప్పు చేసేవారికి రేపు తగిన శిక్ష పడుతుందని హెచ్చరించారు.

కూటమి కార్యకర్తలకే పథకాలు

గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించినట్టు గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే పథకాలు అందుతున్నాయని మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో సూపర్‌గా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అదు వల్లే కూటమి నేతలు గ్రామాల్లోకి ధైర్యంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతం కోసమే మండల, పంచాయతీ, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు.

కుప్పానికి హంద్రీ–నీవా కాలువ తెచ్చింది వైఎస్సార్ కాదా..

పార్టీ రాష్ట్ర కార్యదర్శులు మొగసాల క్రిష్ణమూర్తి, చెంగారెడ్డి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ కుప్పానికి హంద్రీ–నీవా కాలువ తీసుకువచ్చారని గుర్తు చేశారు. పుంగనూరు ఉప కాలువ నుంచి కుప్పానికి కాలువను తవ్వింది గత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాదా అని ప్రశ్నించారు. అప్పుడు కాలువ తవ్వడం వల్లే నేడు చంద్రబాబు నీటిని విడుదల చేసి అంతా తానే చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మురళీకృష్ణ, ప్రహ్లాద, ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్లు బాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవులు, యువరాజ్, పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన

బైరెడ్డిపల్లె/సదుం: జీఎస్టీ తగ్గింపు వల్ల పేద కుటుంబాలకు ఊరట కలుగుతుందని బైరెడ్డిపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనందబాబు, సదుం ఎంపీడీవో రాధారాణి తెలిపారు. వారు సోమవారం జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల నిత్యావసర సరుకులు, గృహోపకరణాల ధరలు తగ్గుతాయని తెలిపారు. తగ్గిన జీఎస్టీ రేట్లతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ ప్రయోజనాలను వారికి వివరించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక సాయం చేయాలి

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీల్లోని వృద్ధులు, యువతకు ప్రతి నెలా ఆర్థిక సాయం అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ కోరారు. ఆయన సోమవారం తహసీల్దార్ రాము, ఎంపీపీ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. తండాల్లోని గిరిజనుల సమస్యలను వారికి వివరించారు. ఇప్పటికి ఎంతో మంది గిరిజనులు మౌలిక వసతులకు నోచుకోలేదన్నారు. ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, నాగేనాయక్, హీరానాయక్, దేశనాయక్, రాజునాయక్, రవీంద్రనాయక్, చిన్ననాయక్, నిర్మలనాయక్, మురగన్‌నాయక్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు



సదుంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు



బైరెడ్డిపల్లె: సంబరాలు చేసుకుంటున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతలు



చౌడేపల్లె బస్టాండులో సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలు



పుంగనూరులో కార్యకర్తల సంబరాలు

సదుం/బైరెడ్డిపల్లె/చౌడేపల్లె/రొంపిచెర్ల/పలమనేరు: అక్రమ కేసులకు తమ కుటుంబం భయపడదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంతో సోమవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచిపెట్టారు.

- సదుంలో జరిగిన కార్యక్రమంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపట్టాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారని, చంద్రబాబు అండ్ కోకు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.
- బైరెడ్డిపల్లెలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పెద్దలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. చివరకు న్యాయం గెలుస్తుందని పేర్కొన్నారు.
- చౌడేపల్లె బస్టాండులో సర్పంచ్ వరుణ్ భరత్ ఆధ్వర్యంలోనూ, కాగతి పంచాయతీ పెద్దూరు వద్ద పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, సర్పంచ్ షంషీర్ ఆధ్వర్యంలోనూ బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.
- సోమల బస్టాండులో నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.
- రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ రామచంద్రాపురం కాలనీ, పెద్దగొట్టిగల్లు పంచాయతీ మేకలవారిపల్లెలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు.
- పలమనేరు పట్టణంలోని గంగమ్మ ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చెంగారెడ్డి, మురళీకృష్ణ, ఎర్రబల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మిథున్‌రెడ్డికి బెయిల్ రావడంపై వైఎస్సార్‌సీపీ నాయకుడు శశిధర్ నాయుడు ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. ఎన్నటికైనా న్యాయం గెలుస్తుందని పేర్కొన్నారు.

నాయకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సుబ్రమణ్యంరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

గంగవరం: ప్రమాదాల్లో గాయపడిన మేలుమాయి పంచాయతీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను సోమవారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించారు. మోతుకులపల్లికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, చిన్నమునాయనిపల్లికి చెందిన మాధవరెడ్డి, అశోక్‌రెడ్డి రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. డ్రైవర్స్ కాలనీలో భారతిరెడ్డి నూతన గృహప్రవేశానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి హాజరయ్యారు. పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు దయానందగౌడు, వినోద్‌రెడ్డి, పవన్‌కుమార్, రాఘవ, మణి తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ స్థలం ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రజకులు

రొంపిచెర్ల: దోబీఘాట్ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని రజకులు ఆరోపించారు. వారు సోమవారం రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రొంపిచెర్ల మండలంలోని రజకులకు ప్రభుత్వం 20 ఏళ్ల క్రితం నగిరి మడుగువారిపల్లె సమీపంలో సర్వే నంబరు 1041లో 40 సెంట్ల స్థలాన్ని మంజూరు చేసిందని తెలిపారు. బీసీ కార్పొరేషన్ కింద అక్కడ బోరు వేసి మోటారు బిగించినట్టు తెలిపారు. గ్రామానికి చెందిన ఒక నేత అక్కడ గొర్రెలు, పశువుల దొడ్లు ఏర్పాటు చేస్తున్నాడని వాపోయారు. దీనిపై తహసీల్దార్ అమరనాథ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆయన సర్వే చేసి స్థలాన్ని తిరిగి అప్పగించారని పేర్కొన్నారు. తాము స్థలం చుట్టూ రాతి కుసాలు నాటి ఫెన్సింగ్ వేసుకుంటుండగా గిరి నాయుడు తన 15 మంది అనుచరులతో వచ్చి అడ్డుకున్నాడని తెలిపారు. రజక సంఘం నాయకులు నాగభూషణం, డాక్టర్ ఎం.వీ.రమణ, వెంకటరత్నం, గుర్రప్ప, హరినాథ్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువకుడు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పలువురు రక్తం దానం చేశారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. తద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తాన్ని ఇవ్వడం ద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు నాగరాజు, బీజేపీ నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురువుకు పాదాభివందనం



పలమనేరు: డిప్యూటీ సీఎం ఓఎస్డీ, ఐఏఎస్ అధికారి మధుసూదన్ సోమవారం గురువుకు పాదాభివందనం చేశారు. ఆయన సోమవారం కుటుంబ సమేతంగా తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన పలమనేరులో వున్న ప్రైవేటు స్కూల్‌కు వచ్చారు. హెచ్‌ఎం శ్రీనివాసులు నాయుడుకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు. ఆయన మాట్లాడుతూ గతంలో తన తండ్రి పలమనేరులో వీఆర్వోగా పనిచేశారని తెలిపారు. ఈ క్రమంలో తాను ఇక్కడ చదివానని, తన గురువులు నేర్పిన క్రమశిక్షణ వల్లే ఉన్నత స్థానానికి చేరుకున్నారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఓఎస్డీ కుటుంబ సభ్యులను సన్మానించారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



పలమనేరు: పలమనేరు ఎక్సైజ్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సోమవారం మృతిచెందిన యువరాజ్‌కు కుటుంబానికి జిల్లా ఈడిగ సంఘం ప్రెసిడెంట్ మద్దిలేటి కృష్ణమూర్తి గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి ఈడిగ సంఘం నాయకులు బుస్సా నాగరాజ్‌గౌడ్, జిల్లా ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలవడంపై కమిషనర్ సహా అన్ని శాఖల అధికారుల కృషి వుందని అభినందించారు. వర్షాలు కురుస్తున్నందున కాలువల్లో మురుగును తొలగించి నీరు వెళ్లేలే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో దోమల నివారణకు మందులు పిచికారి చేయాలని సూచించారు. మురికివాడల్లోని ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు వారికి సహాయం అందించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి, అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సిఆర్.లలిత, నాగేంద్ర, డీఈఈ మహేష్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐలు నరేంద్రరాజు, నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప పాల్గొన్నారు.

120 మంది క్రీడాకారులకు కిట్ల పంపిణీ



క్రీడాకారులతో రోటరీ క్లబ్ సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 120 మంది క్రీడాకారులకు టీషర్టులు, బ్యాడ్మింటన్ కిట్లు అందజేశారు. క్లబ్ సెక్రటరీ హేమచంద్ర, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ రామమోహన్‌రెడ్డి, స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు నానబాలగణేష్, సిఎస్.రాజారెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించడమే రోటరీ క్లబ్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ శరణ్, సుధాకర్‌రెడ్డి, పూలత్యాగరాజు, భాస్కర్, అనీల్‌కుమార్, మునిరాజ, ఆవుల హరిప్రసాద్, సురేష్, వేణుగోపాల్, ఎస్‌వీటీ.కిషోర్, శివశంకర్, వేణుగోపాల్, అర్షద్‌అలి, భాస్కర్‌రెడ్డి, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానప్రదాయని మాతా సరస్వతి







రొంపిచెర్ల : మహాలక్ష్మిగా ముత్యాలమ్మ, సదుం: కామాక్షిగా చౌడేశ్వరిదేవి, బైరెడ్డిపల్లె : సరస్వతీదేవిగా సల్లాపురెమ్మ









సరస్వతిదేవిగా మలాలమ్మ, వాసవీమాత, కాళికాదేవి, కన్యకా పరమేశ్వరి

జ్ఞానప్రదాయని మాతా సరస్వతి పాహిమాం అని భక్తులు అమ్మవార్లను మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతిగా భక్తులను అనుగ్రహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

పుంగనూరు: పట్టణంలోని భోగనంజుడేశ్వర స్వామి ఆలయంలో పార్వతిదేవి, కన్యకా పరమేశ్వరి అమ్మవారు సోమవారం సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. బస్టాండ్‌లోని శ్రీవిరూపాక్షి మారెమ్మను పత్తితో అలంకరించారు.

- వి.కోట: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి, దుర్గామాత సోమవారం సరస్వతి దేవిగా భక్తులకు దర్శమిచ్చారు. సాయంత్రం అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు.
- పెద్దపంజాణి: మండలంలోని శివాడిలో వెలసిన కాళికాదేవి అమ్మవారు సోమవారం సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నారాయణాచారి, చామనేరు ప్రభాకర్‌రెడ్డి, సాయంత్రం సీతమ్మ, లేట్ త్యాగరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.
- గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మలాలమ్మ సోమవారం సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, జెడ్పీటీసీ పార్వతిచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు. వారికి ఆలయ ధర్మకర్త చంద్రప్ప అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.
- రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ సోమవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బండపల్లె బాలాజీ, శ్రీధర్ రెడ్డి కటుంబ సభ్యులు వ్యవహరించారు.
- బైరెడ్డిపల్లె: పట్టణంలో వెలసిన కన్యకా పరమేశ్వరి, సల్లాపురెమ్మ, బాటగంగమ్మ అమ్మవార్లు సోమవారం సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.
- పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బి.గుర్రప్ప శెట్టి, నాగేశ్వరరావు, సురేష్, గోవర్ధన శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.
- సదుం: మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి అమ్మవారు సోమవారం కామాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. సదుమమ్మ అమ్మవారు రాజరాజేశ్వరిగా సింహ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రెడ్డి కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

రెస్కోకు పూర్వ వైభవం

కుప్పం: కుప్పం రెస్కోకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. 12 ఏళ్ల అనంతరం సోమవారం రెస్కో చైర్మన్ ప్రతాప్ అధ్యక్షతన మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెస్కో అప్పుల్లో కూరుకుపోయిందని, నియోజకవర్గంలోని పంచాయతీల విద్యుత్ వీధి దీపాల బకాయిలు రూ.200 కోట్లకు పైగా వున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, రెస్కో అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆర్డీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఉడా చైర్మన్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

2న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో అక్టోబర్ 2న సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులు తప్పక హాజరుకావాలని కోరారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.